https://siddipettimes.com

# సిద్దిపేట టైమ్స్

తెలుగు దినపత్రిక

సంపుటి - 01 | సంచిక - 291 | తెలంగాణ | సోమవారం | తేదీ: 07.04.2024 | ఎడిటర్ : మదూరి శ్రీరామ్ | పేజీలు 6 | వెల రూ.3

## ఎస్ఎల్‌బీసీ.. ఏం చేద్దాం..

- బైపాస్ టన్నెల్ నిర్మాణం అసాధ్యం!
- ఆడిట్ ఏర్పాటూ అంత సులువేం కాదు..
- అదనపు ఖర్చు.. మరింత సమయం
- ప్రభుత్వానికి తేల్చిచెప్పిన నిపుణులు
- అవుట్‌లెట్ వైపు నుంచే టీబీఎంతోనే ముందుకెళ్లాలి
- మార్గంలో మరిన్ని షీర్ జోన్లు
- లేదంటే డ్రిల్లింగ్ బ్లాస్టింగ్ మెథడ్
- అదీ కూడా కత్తిమీద సామే..

2



# రమణీయం.. రాములోరి కల్యాణం





- భద్రాచలంలో వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం
- ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం దంపతులు
- నేడు శ్రీరామ మహాపట్టాభిషేకం
- వస్త్రాలు సమర్పించనున్న గవర్నర్



**భద్రాచలం**

భద్రాద్రి రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. రామ నామ జపంతో భక్తులు పరవశించిపోతుండగా.. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకే స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు, మంగళాశాసనం, అభిషేకం చేశారు. తదుపరి ధ్రువమూర్తులకు కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ శ్రీధర్ పాల్గొన్నారు. ఉదయం 9.45 గంటలకు వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ ఊరేగింపుగా మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపానికి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తీసుకొచ్చారు. స్వర్ణ సింహాసనంపై స్వామివారిని, అమ్మవారిని ఆసీనులను చేశారు. కల్యాణం సందర్భంగా భక్తరామదాసు చేయించిన నగలను వధూవరులకు ధరింపజేశారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల

మిగతా 2లో

## పేదవారి కళ్లలో.. ఆనందం చూశా..

- పేదలందరికీ ఆహార భద్రత కల్పించేందుకే రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- భద్రాద్రి జిల్లా సారపాకలోని గిరిజన లబ్ధిదారు ఇంట్లో సన్నబియ్యంతో భోజనం
- ఆ కుటుంబానికి కొత్తవస్త్రాల అందజేత సీఎంతో పాటు భట్టి , తుమ్మల, పొంగులేటి

2



## కలిసి నడిచి కాపాడుకుందాం

- విద్యార్థులు, పర్యావరణవేత్తలకు కేటీఆర్ పిలుపు
- ఎకో పార్క్ పేరుతో సరికొత్త మోసం..
- విద్యార్థులపైనే అపవాదులు..

**హైదరాబాద్**

కంచ గచ్చిబౌలి, హెచ్సీయూ రక్షణకు చేతులు కలపాలని పర్యావరణవేత్తలు, విద్యార్థులు, సామాన్య ప్రజలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వారికి బహిరంగ లేఖ రాశారు. హెచ్‌సీయూ భూముల వివాదాన్ని కేటీఆర్ సీరియస్గా తీసుకున్నారు. ఈమేరకు రేవంత్ సర్కార్ తీరును లేఖలో ఎండగట్టారు . 400 ఎకరాల పర్యావరణం ప్రమాదంలో పడిందని, 734 జాతుల మొక్కలు, 220 పక్షులు, 15 సరీసృపాలు, 10 క్షీరదాల ఆవాసం నాశనం కాకుండా ఆపుదాం అని లేఖ ద్వారా కేటీఆర్

మిగతా 2లో

## అకారణంగా ఏడుస్తుంటారు

- కొందరికి ఇది అలవాటుగా మారింది..
- మనమేం చేయలేం.. స్టాలిన్‌పై మోదీ విమర్శ
- తమ హయాంలోనే తమిళనాడుకు ఎక్కువ కేటాయింపులని వెల్లడి
- తనకు లేఖలు రాస్తున్న తమిళ నేతలు
- తమిళంలో సంతకం సైతం చేయడం లేదని ఎద్దేవా
- పాంబన్ వంతెనను ప్రారంభించిన ప్రధాని..
- తమిళనాడు సీఎం గైర్హాజరు
- సాంకేతికత-సంప్రదాయాల సమ్మేళనం పాంబన్
- వందేళ్ల క్రితం గుజరాతీ బిడ్డ నిర్మించాడు
- ఇప్పుడు మళ్లీ గుజరాత్ బిడ్డకు అవకాశం: మోదీ



2లో..

## కంచ గచ్చిబౌలిపై కేంద్రంలో కదలిక

రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం లేఖ



2లో..



## దేశద్రోహి పార్టీకి ఓటేస్తారా?

### కేంద్ర మంత్రి సంచలన వ్యాఖ్యలు

- రాష్ట్రాన్ని మజ్లిస్‌కు అప్పగించేందుకు కుట్ర
- తెలంగాణలో ఉచిత బియ్యం ఇస్తోంది బీజేపీ
- పాలన ఎవరి చేతిలో ఉందో అర్థం చేసుకోవచ్చు
- బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో బండి కామెంట్స్

**కరీంనగర్** : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన పూర్తిగా భ్రష్టు పట్టిపోయిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలియజేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పతాకావిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణలో గతంలో ఎన్నడూ చూడని దౌర్భాగ్యపు పాలన నడుస్తుందన్నారు.

2లో..

# రమణీయం.. రాములోరి కల్యాణం

మొదటిపేజీ తరువాయి

రేవంత్‌రెడ్డి తొలిసారి సతీసమేతంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. రేవంత్‌రెడ్డి, ఆయన సతీమణి గీత ఉదయం 11.33 గంటలకు రామాలయానికి చేరుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. పూజల తర్వాత సీఎం దంపతులు 11.45 గంటలకు మిథిలా స్టేడియానికి చేరుకున్నారు. అక్కడ జీలకర్రబెల్లం సమయంలో పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రామయ్యకు సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నం సమీపించగానే వేద పండితులు ఉత్సవమూర్తుల శిరస్సుపై జీలకర్ర బెల్లం ఉంచారు. అనంతరం మూడు సూత్రాలతో కన్నుల పండువగా మాంగళ్య ధారణ నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి తిలకించారు. అదేవిధంగా హైకోర్టు న్యాయమూర్తులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. టీటీడీ తరఫున చైర్మన్ బీఆర్ నాయుడు శ్రీసీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

### భారీగా తరలివచ్చిన భక్తజనం

సీతారాముల కల్యాణాన్ని తిలకించడానికి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వసతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎండ తీవ్రతను తాళలేక అవస్థలు పడ్డారు. కల్యాణ మండపానికి చేరుకునే మార్గాల్లో బారికేడ్లను ఏర్పాటు చేయడంతో భక్తులు ఇక్కట్ల పాలయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే సమయంలో గంటపాటు సామాన్య భక్తులకు స్వామి వారి దర్శనాన్ని నిలిపివేశారు. ఒక మహిళా ఎస్సై అత్యుత్సాహం ప్రదర్శించారు. నిఘా వర్గాల సిబ్బందిని సైతం వెళ్లిపోవాలని హుకుం జారీ చేయడం గమనార్హం. ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సీఎం రాకను చిత్రీకరించేందుకు ప్రయత్నించగా వారినీ ఆ ఎస్సై వెళ్లిపోవాలని హెచ్చరించారు. తమకు పాస్‌లు ఉన్నాయని చెప్పినా వినిపించుకోలేదు. చివరిలో కల్యాణ తలంబ్రాల కోసం భక్తులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది.

### నేడు శ్రీరామ మహాపట్టాభిషేకం

కల్యాణం అనంతరం ఒక్క రామయ్యకు మాత్రమే నిర్వహించే విలక్షణ ఉత్సవం మహాపట్టాభిషేకం. ఏటా శ్రీరామ నవమి మరుసటి రోజు జరిగే ఉత్సవాన్ని శ్రీరామ మహాపట్టాభిషేకంగా పేర్కొంటారు. ఇందులో భాగంగా శ్రీరాముడికి ఆభరణాలతో పాటు రాజదండం, రాజముద్రిక, ఛత్రం, శంఖు, చక్రాలు, కిరీటం ధరింపజేస్తారు. సోమవారం నిర్వహించే ఈ పట్టాభిషేకానికి భద్రాచలం దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శ్రీరామ మహాపట్టాభిషేకానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

# పేదవారి కళ్లలో.. ఆనందం చూశా..

**బూర్గంపాడు**

రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ పథకంతో పేదవారి కళ్లలో ఆనందం చూశానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పేదవాడి ఇంట్లో సన్నబియ్యంతో అన్నం రుచిని స్వయంగా చూడడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ పూర్తిస్థాయిలో ఆహార భద్రత కల్పించేందుకే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ పథకానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, 80 శాతానికి పైగా బడుగు, బలహీన, దళిత, గిరిజన, మైనారిటీ నిరుపేద ప్రజలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ముత్యాలమ్మపేటకు చెందిన ఆదివాసీ కుటుంబం, సన్నబియ్యం లబ్ధిదారు బూరం శ్రీనివాసరావు ఇంట్లో సీఎం రేవంత్‌రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి భోజనం చేశారు. తొలుత తమ ఇంటికి చేరుకున్న ముఖ్యమంత్రికి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం రేషన్‌షాపు నుంచి తీసుకువచ్చిన సన్నబియ్యంతో వండిన అన్నంతోపాటు పాయసం, పులిహోర, తోటకూర పప్పు, గోంగూర చట్నీ, బెల్లం పానకం, ఇతర ఆహార పదార్థాలు వడ్డించారు. కాగా, భోజనం చేస్తున్న సమయంలో సీఎం ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ వారి కుటుంబ పరిస్థితులు, జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం పథకం తమ లాంటి పేద కుటుంబాలకు ఎంతో మేలు చేస్తుందని వారు సీఎంకు తెలిపారు. మానవతా దృక్పథంతో నడిపిస్తున్న గొప్ప పథకమంటూ ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. భోజనం అనంతరం ఆ కుటుంబ సభ్యులను సీఎం అభినందించారు. వారికి నూతన వస్త్రాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

### ఇబ్బందుల్లో ఉన్నాం.. ఆదుకోండి

తమ కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో ఉందని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. లబ్ధిదారు తల్లి పద్మావతి మాట్లాడుతూ.. తన భర్త శంకరరావు జీసీసీ సేల్స్‌మేన్‌గా పనిచేసి 2015లో రిటైరయ్యారని, తన కుమారుడు ఏంఏ బీఈడీ చదువుకుని కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని, తన కుమార్తె సుహాసిని చిన్నప్పటి నుంచి మానసిక ఇబ్బందులతోపాటు కనుచూపు లేక అవస్థలు పడుతోందని సీఎంకు చెప్పారు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి.. వారి సమస్యలను పరిష్కరించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి ఆశీస్సుల వల్లే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ఇంటికి భోజనానికి వచ్చారంటూ బూరం శ్రీనివాసరావు కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. నిరుపేదలమైన తమ ఇంట్లో సీఎంతోపాటు డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు భోజనం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ శ్రీరామ నవమిని తమ జీవితంలో మర్చిపోలేమని అన్నారు.

### మధుర జ్ఞాపకం

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలో సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో భోజనం చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. "పేదవాడి ఇంట కంచంలో సన్నబియ్యం.. స్వయంగా రుచి చూశా. వారి కళ్లల్లో ఆనందాన్నీ చూశా. సారపాకలో లబ్ధిదారుల ఇంట సహపంక్తి భోజనం చేసి పథకం అమలును స్వయంగా పరిశీలించా" అంటూ ఎక్స్‌లో సీఎం ట్వీట్ చేశారు. దీంతోపాటు రాములోరి పెళ్లికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించడం ఒక మధుర జ్ఞాపకమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. "కన్నుల పండువగా భద్రాద్రి వేడుకగా శ్రీ సీతారామస్వామి కల్యాణం కమనీయం. పల్లెపల్లెన పెళ్లి సందడి.. ఈ సీతారాముల కల్యాణ వైభోగం" అంటూ 'ఎక్స్'లో సీఎం పోస్ట్ చేశారు.

# దేశద్రోహి పార్టీకి ఓటేస్తారా?

## కేంద్ర మంత్రి సంచలన వ్యాఖ్యలు

- రాష్ట్రాన్ని మజ్లిస్‌కు అప్పగించేందుకు కు
- తెలంగాణలో ఉచిత బియ్యం ఇస్తోంది బీజేపీ
- పాలన ఎవరి చేతిలో ఉందో అర్థం చేసుకోవచ్చు
- బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో బండి కామెంట్స్

**కరీంనగర్** : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన పూర్తిగా భ్రష్టు పట్టిపోయిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలియజేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పతాకావిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణలో గతంలో ఎన్నడూ చూడని దౌర్భాగ్యపు పాలన నడుస్తుందన్నారు. జన్ పత్, గాంధీభవన్ నుండి పాలన నడుస్తూ ఉండడం విడ్డూరంగా ఉందన్నారు.

మంత్రివర్గంలో ఎవరుండాలనేది కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయిస్తుందనడం విడ్డూరమని,మంత్రివర్గ విస్తరణ సీఎం విచక్షణాధికారం అన్నారు.కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయిస్తుందని పీసీసీ అధ్యక్షులు చెప్పడం సిగ్గు చేటని, తెలంగాణ లో దోచుకుని ఢిల్లీ పెద్దలకు కప్పం కడుతున్నారన్నారు. పాలనపై సీఎంకు పట్టులేకుండా పోయిందని, హెచ్ సీయూ భూముల వ్యవహారమే ఇందుకు కారణమన్నారు.

కాంగ్రెస్ అవినీతి పాలనను అంతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని, హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటై మజ్లిస్ ను గెలిపించాలను కుంటనాయన్నారు. హైదరాబాద్ ను మజ్లిస్ కు అప్పగించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీపడుతున్నాయని, దేశ ద్రోహ పార్టీ మజ్లిస్ అని, దేశభక్తి పార్టీ బీజేపీ అన్నారు.

హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో దేశద్రోహ పార్టీకి, దేశభక్తి పార్టీకి మధ్య జరుగుతున్న ఎన్నికలన్నారు. ఎవరి పక్షాన నిలబడి ఓటేస్తారో హైదరాబాద్ కార్పొరేటర్లు, ఓటర్లు ఆలోచించాలన్నారు. సిద్ధాంతం కోసం పనిచేసే బీజేపీ అభ్యర్థి గౌతంరావు గెలుస్తారనే నమ్మకం ఉందని, బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్నడో కుమ్మక్కైనాయన్నారు.

చెన్నయ్ లో డీలిమిటేషన్ మీటింగ్ కు రెండు పార్టీలు కలిసే హాజరైనాయని, వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రెండు పార్టీలు కలిసే ఓటేసి నాయన్నారు. 45 ఏళ్లుగా బీజేపీ అనేక ఒడిదొడుకులు, అవమానాలను అధిగమించిన పార్టీ బీజేపీ అన్నారు. వేలాది మంది కార్యకర్తల బలిదానాలు, లక్షలాది మంది పోరాటాలతో అధికారంలోకి వచ్చిందన్నారు. జాతీయ భావజాలం, సిద్ధాంత బలమే బీజేపీ ఈ స్థాయికి చేరిందన్నారు.

2019లోనే బీజేపీ 18 కోట్ల సభ్యత్వంతో ప్రపంచంలోనే నెంబర్ వన్ పార్టీగా అవతరించిందన్నారు. 16 రాష్ట్రాల్లో సొంతంగా, 6 రాష్ట్రాల్లో కూటమి ద్వారా ప్రభుత్వాలను కొనసాగిస్తున్నామన్నారు. వాజ్ పేయి ఆధ్వర్యంలో ప్రోక్రాన్ అణుపరీక్షలతో దేశ సత్తా చాటినామని, స్వర్ణ చతుర్భుజీ పేరుతో జాతీయ రహదారులను విస్తరించిన ఘనత బీజేపీదే అన్నారు.

చిట్టచివరి వ్యక్తులకు సంక్షేమ ఫలాలు అందించాలన్న దీన్ దయాళ్ ఆశయాలను కొనసాగిస్తున్నామని, మోదీ పాలనలో భారత్ ఆర్థిక ప్రగతిలో అద్భుత ఫలితాలను కనబరుస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో దేశం దూసుకుపోతోందని, కేంద్ర సంక్షేమ పథకాలను పూర్తిగా తెలంగాణలో అమలు చేయడం లేదన్నారు.

అన్ని రాష్ట్రాలను సమాన దృక్పథంతో చూస్తూ అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం మోదీదే అని,రేషన్ షాపుల వద్ద ప్రజలకు ఇచ్చేది మోదీ బియ్యమే అన్నారు. కిలోకు రూ.37 లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం మోదీదే అని, సన్న బియ్యం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం భరించేది కేవలం 10 రూపాయలు మాత్రమే అన్నారు.ఆ విషయాన్ని తెలుసుకుని మంత్రులు, కాంగ్రెస్ నేతలు మాట్లాడితే మంచిదన్నారు. అట్లాంటప్పుడు రేషన్ షాపుల వద్ద ప్రధాని ఫోటో ఎందుకు పెట్టకూడదన్నారు.

బీజేపీ కార్యకర్తలు గ్రామగ్రామాన తిరిగి ప్రజలకు రేషన్ బియ్యంపై వాస్తవాలు వివరించాలన్నారు. వడ్ల కొనుగోలు నుండి బియ్యం దాకా ప్రతిపైసా కేంద్రమే చెల్లిస్తోందన్నారు.గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి నిధులన్నీ ఎవరు చెల్లిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

# అకారణంగా ఏడుస్తుంటారు

**చెన్నై,**

తమిళనాడు అభివృద్ధికి కేంద్రం ఎంతో చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. అయినా అకారణంగా ఏడవడం కొందరికి అలవాటుగా మారిందని విమర్శించారు. 'వారు ఏడుస్తూనే ఉంటారు. మనమేమీ చేయలేం' అని తమిళనాడు సీఎం స్టాలిన్ అండ్‌కోపై ధ్వజమెత్తారు. అలాగే తనకు ఎంతో మంది తమిళనాడు నేతలు లేఖలు రాస్తుంటారని.. ఒక్కరు కూడా తమిళంలో సంతకం చేయడం లేదని ఆక్షేపించారు. శ్రీలంక పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం వాయుసేనకు చెందిన ప్రత్యేక హెలికాప్టర్‌లో నేరుగా రామనాథపురం జిల్లా మండపం వచ్చిన ప్రధాని.. పాంబన్ సముద్ర వంతెనను లాంఛనంగా ప్రారంభించారు. వంతెన పై నుంచి రైలుకు, కింది నుంచి నౌకా రవాణాకు కూడా పచ్చజెండా ఊపారు. అంతేగాక రాష్ట్రంలో రూ.8,300 కోట్ల విలువైన వివిధ రైలు, రోడ్డు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ప్రధాని ప్రసంగించారు. తమిళనాడుకు రావలసిన నిధులను కేంద్రం నిలిపివేసిందన్న సీఎం స్టాలిన్ ఆరోపణలను మోదీ ఈ సందర్భంగా ఖండించారు. గతంతో పోలిస్తే గడిచిన పదేళ్లలో తమిళనాడుకు 3 రెట్లు అధికంగా నిధులిచ్చామన్నారు. 'గత పదేళ్లలో తమిళనాడుకు రైల్వే బడ్జెట్‌ను 7రెట్లు పెంచాం. రామేశ్వరం సహా రాష్ట్రంలో 77 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నాం. పీఎం ఆవాస్ యోజన కింద తమిళనాడులో 12 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించాం. ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఈ రాష్ట్రంలో కోటికిపైగా చికిత్సలు జరిగాయి' అని తెలిపారు. హిందీ భాషను కేంద్రం తమపై రుద్దాలని చూస్తోందని ఆరోపిస్తున్న స్టాలిన్‌పై ప్రధాని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. 'చాలా మంది తమిళనాడు నాయకులు నాకు లేఖలు రాస్తుంటారు. కానీ ఎవరూ తమిళంలో సంతకం చేయరు. నిజంగా వారికి తమిళ భాష అంటే అంత అభిమానముంటే మొదట తమిళంలో సంతకం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని వ్యాఖ్యానించారు.

డాక్టర్లు కావాలని కలలు కంటున్న పేద నేపథ్యం కలిగిన విద్యార్థులకు మేలు చేసేలా వైద్య విద్య కోర్సులను మాతృభాష తమిళంలో బోధించాలని స్టాలిన్ ప్రభుత్వాన్ని ఆయన కోరారు. తమిళ భాష, సంస్కృతిని ప్రపంచం నలుమూలలకూ చేర్చేందుకు కేంద్రం నిరంతరం కృషిచేస్తోందన్నారు. శ్రీరాముడి జీవితం, సుపరిపాలనా స్ఫూర్తి.. జాతి నిర్మాణానికి ముఖ్యమైన పునాదిగా పని చేస్తాయని చెప్పారు. శ్రీరామనవమి సందర్భంగా పవిత్ర భూమి రామేశ్వరం నుంచి దేశ పౌరులందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

### పాంబన్‌తో ఎంతో మేలు

'భారతరత్న' డాక్టర్ కలాం జన్మించిన భూమి రామేశ్వరమని ప్రధాని తెలిపారు. ఆయన జీవితం సైన్స్-ఆధ్యాత్మికత సమ్మిళితమని.. కొత్త పాంబన్ వంతెన కూడా సాంకేతిక-సంప్రదాయాల సమ్మేళనంగా అభివర్ణించారు. వేల సంవత్సరాల పురాతనమైన ఈ పట్టణం.. ఇప్పుడు 21వ శతాబ్దపు ఇంజనీరింగ్ అద్భుతంతో.. ప్రధాన భూభాగానికి అనుసంధానమైందన్నారు. పాంబన్ సహా దేశంలో నాలుగు దిక్కులా నిర్మించిన వంతెనలను మోదీ ప్రస్తావించారు. ఉత్తరాన జమ్మూకశ్మీర్‌లోని చీనాబ్ వంతెన ప్రపంచంలోనే ఎత్తయిన రైలు వంతెనల్లో ఒకటని.. పశ్చిమాన ముంబైలో ఇప్పుడు దేశంలోనే అతి పొడవైన సముద్రపు వంతెన అటల్ సేతు ఉందని.. తూర్పున అసోంలోని బోగిబీల్ వంతెన పురోగతికి నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. మత్స్యకారుల భద్రతకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోందని.. గత పదేళ్లలో శ్రీలంక చెర నుంచి 3,700 మందికి పైగా మత్స్యకారులను స్వదేశానికి తీసుకొచ్చామని చెప్పారు. ఇదిలా ఉండగా, శ్రీలంకలో మూడ్రోజుల పర్యటనలో చివరి రోజు ఆదివారం ప్రధాని మోదీ చారిత్రక, ఆధ్యాత్మిక నగరం అనూరాధపురకు వెళ్లారు. అక్కడ రూ.780కోట్ల భారత్ సాయంతో పునర్నిర్మించిన మహెూ-ఒమన్‌థాయ్ రైల్వే లైనును ప్రారంభించారు.

తర్వాత జయశ్రీ మహాబోధి ఆలయాన్ని సందర్శించారు. క్రీ.పూ.3వ శతాబ్దంలో అశోక చక్రవర్తి కుమార్తె సంఘమిత్త మహా థెరి నెలకొల్పిన మహాబోధి వృక్షం వద్ద ప్రార్థనలు చేశారు. మరోవైపు, మోదీ కోరిక మేరకు ఆదివారం 11 మంది తమిళ జాలర్లను శ్రీలంక విడుదల చేసింది.

### అప్పుడూ.. ఇప్పుడూ గుజరాతీ బిడ్డే

పాంబన్‌లో వందేళ్ల క్రితం గుజరాత్‌కు చెందిన వ్యక్తి రైల్వే వంతెన నిర్మించారని, మళ్లీ శతాబ్దం తర్వాత ఇదే స్థలంలో కొత్త వంతెన నిర్మించే అదృష్టం గుజరాతీ బిడ్డ(మోదీ)కే వచ్చిందని మోదీ సభలో వ్యాఖ్యానించారు. పాంబన్ కొత్త రైలు వంతెనను ప్రారంభించి, జాతికి అంకితం చేసిన అనంతరం ప్రధాని.. తమిళ సంప్రదాయ దుస్తులైన ధోవతి, పట్టు చొక్కా, పట్టు అంగవస్త్రం ధరించి రామేశ్వరంలోని పర్వతవర్ధినీ సమేత రామనాథస్వామి ఆలయాన్ని సందర్శించారు. మధ్యాహ్నం 12.45 గంటలకు ఆలయానికి వెళ్లిన ఆయన మూలవిరాట్ ముంగిట నేలపై ఆసీనులై స్వామివారికి మొక్కారు. ఇదిలా ఉండగా, హెలికాప్టర్లో శ్రీలంక నుండి రామనాథపురం మండపం వచ్చేటప్పుడు 'రామసేతు'ను దర్శించుకునే అరుదైన భాగ్యం తనకు కలిగిందని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'దైవానుకూలంగా అయోధ్యలో సూర్యతిలకధారణ జరిగే సమయంలో ఈ సేతుబంధనాన్ని వీక్షించాను. ఇలా ఒకే సమయంలో రెండు దర్శనాలు శ్రీరామచంద్రుడి అనుగ్రహమే' అన్నారు.

# ఎస్ఎల్‌బీసీ.. ఏం చేద్దాం..

**హైదరాబాద్**

శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) సొరంగ నిర్మాణాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలని సర్కారు తర్జనభర్జన పడుతున్నది. ప్రమాదకర ప్రాంతాన్ని తప్పి స్తూ బైపాస్ సొరంగాన్ని చేపడితే ఎలా ఉంటుందనే ఆలోచన చేసినా అది అసాధ్యమ ని నిపుణులు తేల్చారు. సొరంగానికి ఆడిట్ పాయింట్‌ను ఏర్పాటు చేయాలని భావించినా అది అదనపు ఖర్చుతోపాటు మరింత సమ యం పడుతుందని పేర్కొన్నారు. సొరంగాన్ని త్వరగా పూర్తి చేసేందుకు డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ మెథడ్(డీబీఎం) ఒక్కటే సరైన మార్గమని, అయితే అనుమతులు తీసుకోవడమేగాక, పనుల నిర్వహణ కూడా కత్తిమీద సాములాంటిదేనని వివరించారు. ఎట్టకేలకు అవుట్‌లెట్ వైపు నుంచి టీబీఎంతో యథావిధిగా పనులు కొనసాగించాలని నిర్ణయించినా పను లు జాప్యమయ్యే అవకాశముందని సమాచారం. దీంతో ఇప్పుడేం చేయాలా? అని సర్కారు డైలమాలో పడినట్టు తెలుస్తున్నది.

### టన్నెల్ బైపాస్ అసాధ్యం..

శ్రీశైలం రిజర్వాయర్ నుంచి దిండి రిజర్వాయర్ వరకు 43.50 కి.మీ సొరంగాన్ని తవ్వా ల్సి ఉంది. ఏకకాలంలో రెండువైపుల నుంచి సొరంగం పనులు చేపట్టారు. ఇన్‌లెట్ అంటే అచ్చంపేట మండలం దోమలపెంట వద్ద శ్రీశై లం రిజర్వాయర్ గట్టు నుంచి, అవుట్‌లెట్ అంటే మహబూబ్‌నగర్ జిల్లా మన్యవారిపల్లె నుంచి సొరంగం పనులు చేపట్టారు. ఇప్పటివరకు రెండువైపుల కలిపి 34.372 కి.మీ సొరంగం పనులు పూర్తికాగా, ఇంకా 9.560 కి.మీ మేర తవ్వాల్సి ఉంది. ఇన్‌లెట్ టన్నెల్‌లో 13.93కి.మీ వద్ద అత్యంత సున్నితమైన షీర్ (పగులువారి వదులైన రాతిపొరలు) జోన్ వద్ద భారీ నీటి ఊటల నేపథ్యంలో టన్నె ల్ పైకప్పు కూలిపోయి 8మంది కార్మికులు మృతి చెందారు. ప్రస్తుతం మృతదేహాల వెలికితీతకు సహాయక చర్యలు కొనసాగుతున్నా యి. టన్నెల్ పనులను ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై ప్రభుత్వ పెద్దలు ఇటీవల పలువురు నిపుణులు, ఏజెన్సీ ప్రతినిధులతో చర్చించారు. ప్రస్తుతం ప్రమాదం సంభవించిన చోటున ఉన్న షీర్ జోన్‌ను పక్కకు తప్పిస్తూ టన్నెల్‌ను బైపాస్ చేయాలని ఆలోచ న చేశారు.

కొద్దిదూరం ముందుకు తీసుకెళ్లిన అనంతరం యథావిధిగా ప్రధాన టన్నెల్ మా ర్గానికి అనుసంధానిస్తే బావుంటుందనే అభిప్రాయానికి వచ్చారు. ఆచరణలో అది అసాధ్యమని ఏజెన్సీకి చెందిన విదేశీ నిపుణులు ప్రభుత్వానికి తేల్చిచెప్పినట్టు సమాచారం. అదీగాక టన్నెల్ అలైన్‌మెంట్ మార్గంలో మరో 4షీర్ జోన్లు కూడా ఉన్నాయని, అక్క డా ఇలాంటి పరిస్థితే ఎదురుకాదని చెప్పలేమని పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగానికి ఇప్పటికీ ఒక్క ఆడిట్ పాయింట్ అనేది లేదు. ఉపరితలంలో దట్టమైన అభయారణ్యం విస్తరించి ఉండడమే కారణం. ఆడిట్ పాయింట్ అంటే టన్నెల్ తవ్వకంలో వచ్చే రాళ్లు, మట్టి తరలింపు, రవాణా అవసరాల కోసం, లోపలికి ఆక్సిజన్, వెలుతురు కోసం సొరంగానికి ఏర్పాటు చేసే అదనపు మార్గం. ప్రస్తుతం అమ్రాబాద్ మండలం తిర్మలాపూర్ వద్ద నుంచి ఆడిట్ ఏర్పాటుకు అవకాశమున్నదని సర్కారు భావిస్తున్నది. దానిని కూడా నిపుణు లు తోసిపుచ్చినట్టు సమాచారం. తిర్మలాపూర్ నుంచి ఎస్ఎల్‌బీసీ సొరంగం వరకు 5కి.మీ దూరం ఉంటుందని, ఆ మేరకు ఆడిట్ సొరంగాన్ని తవ్వాల్సి ఉంటుందని, అదనపు ఖర్చు అని, టన్నెల్ నుంచి వెలికితీసిన మట్టి, రాళ్లను ఆడిట్‌పాయింట్ నుంచి బయటకు తరలించి నా, వాటిని నిల్వచేసేందుకు భారీగా భూసేకరణ చేపట్టాల్సి ఉంటుందని వివరించినట్టు సమాచారం. ఆడిట్‌పాయింట్ ఏర్పాటును ఆదిలోనే విరమించుకున్నారని తెలిసింది.

### డైలమాలో సర్కారు..!

ఎస్ఎల్‌బీసీ సొరంగం తవ్వకాన్ని టీబీఎం (టన్నెట్ బోరింగ్ మిషన్) ద్వారా కొనసాగిస్తున్నారు. ఆ టీబీఎం ఏర్పాటు చేసి 20ఏండ్లు కాగా, సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయింది. గంటకు 2.5మీటర్లు బోరింగ్ చేయాల్సిన టీబీఎం సామర్థ్యం రోజుకు గరిష్ఠంగా 5 మీట ర్లు కూడా దాటని పరిస్థితి ఏర్పడింది. భారీగా నీటి ఊట రావడం సవాలుగా నిలిచింది. ప్రమాదంలో ఆ టీబీఎం పూర్తిగా దెబ్బతిన్నట్టు తెలుస్తున్నది. కొత్త టీబీఎం ఏర్పాటుకు రూ. 300-400కోట్ల మేర నిధులు కావడమేగాక, దానిని విదేశాల నుంచి తెప్పించడానికి ఏడాది పట్టే అవకాశమున్నది. దీంతో ప్రస్తుతం డీబీఎం (డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ మెథడ్) విధానం ఒక్కటే శరణ్యమని నిపుణులు సర్కారుకు సూచించినట్టు తెలిసింది. అభయారణ్యా న్ని దృష్టిలో పెట్టుకుని భూప్రకంపనలు లేకుం డా చూసుకోవాల్సి ఉంటుందని, శబ్ధం 50 డెసిబుల్స్ దాటకూడదనే కేంద్రం షరతులకు లోబడి పనులు చేయాల్సి ఉంటుందని తెలిపా రు. టీబీఎం టెక్నాలజీలో ఆటోమేటిక్‌గా మ్యూక్‌ను(వ్యర్థాలను) కన్వేయర్ బెల్ట్ నుంచి బయటకు పంపే అవకాశముండగా, డీబీఎం లో మాన్యువల్‌గా తరలించాల్సి ఉంటుంది. ఆడిట్ పాయింట్ ఉంటేనే డీబీఎం విధానంలో సొరంగం తవ్వకం సులువని, లేదంటే అదీ అసాధ్యమేనని చెప్పినట్టు సమాచారం. చివరగా ఇన్‌లెట్ పనులన్నీ నిలిపివేసి, అవుట్‌లెట్ నుంచే టన్నెల్ పనులను కొనసాగించవచ్చని, సొరంగం పూర్తికి మరింత సమయం పట్టే అవకాశమున్నదని తెలిపినట్టు తెలిసింది. నిపుణులు, ఇంజినీర్లు వెల్లడించిన అభిప్రాయాల నేపథ్యంలో సర్కారు పూర్తిగా డైలమాలో పడింది. ఎస్ఎల్‌బీసీని ఏం చేద్దాం? పనుల విషయంలో ఎలా ముందుకు వెళ్లాలి? అనే అంశాలపై తర్జనభర్జన పడుతున్నది.

### కొనసాగుతున్న సహాయక చర్యలు

**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 6 :** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం దోమలపెంట ఎల్ఎల్‌బీసీలో చిక్కుకున్న ఆరుగురి కార్మికుల మృతదేహాల కోసం అన్వేషణ కొనసాగుతున్నది. మినీ జేసీబీ సహాయంతో లోకో ట్రైన్, టీబీఎం మిషన్ కటింగ్ చేసిన శకలాలను బయటకు తరలించారు. ఆదివారం టన్నెల్ ప్రత్యేకాధికారి శివశంకర్ రెస్క్యూ బృందాల ప్రతినిధులతో మరోసారి సమీక్ష నిర్వహించారు.

# కలిసి నడిచి కాపాడుకుందాం

## విద్యార్థులు, పర్యావరణవేత్తలకు కేటీఆర్ పిలుపు

మొదటిపేజీ తరువాయి

పిలుపునిచ్చారు.

### విద్యార్థులపైనే అపవాదులు..

ప్రభుత్వం ఆర్థిక లాభం కోసం పర్యావరణంపై దాడి చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం పర్యావరణం నాశనం చేసే ప్రణాళికలు కొనసాగిస్తోంది. విద్యార్థుల నిరసనకు సలాం. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు శాంతియుతంగా అడవి రక్షణకు పోరాడుతున్నారు. విద్యార్థులపై అపవాదులు, యూనివర్సిటీని తరలించే బెదిరింపులు ప్రభుత్వ రియల్ ఎస్టేట్ మనస్తత్వానికి నిదర్శనం అంటూ కేటీఆర్ మండిపడ్డారు.

### ఎకో పార్క్ పేరుతో సరికొత్త మోసం..

అడవిని కాపాడే బదులు భూమి ఆక్రమణకు ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. నిరసనలు కొనసాగితే హెచ్‌సీయూని ఫోర్త్ సిటీకి తరలిస్తామని హెచ్చరిక తప్పు. పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులకు మద్దతుగా నిలవాలి. కంచ గచ్చిబౌలి, యూనివర్సిటీని కాపాడుతామని బీఆర్ఎస్ పార్టీ నుంచి హామీ హామీ ఇస్తున్నాము. సుప్రీం కోర్టు ఆదేశాలను పాటించి, భూమి విక్రయాన్ని రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు

# కంచ గచ్చిబౌలిపై కేంద్రంలో కదలిక

## చెట్ల నరికివేత, వన్యప్రాణులకు నష్టంపై సమగ్ర నివేదికకు ఆదేశం

**హైదరాబాద్**

: కంచ గచ్చిబౌలిలోని భూములు, పర్యావరణ, వన్యప్రాణి సంరక్షణ కోసం పోరాటం జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించింది. సమగ్ర వివరణతో నివేదిక ఇవ్వాలని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. టీజీఐఐసీ ద్వారా అడవిలోని చెట్లను అక్రమంగా తొలగించినట్టు, అక్కడి వన్యప్రాణులు, సరస్సులు, ప్రత్యేక రాతి శిలలకు నష్టం జరిగినట్టు మీడియా కథనాల్లో చూశామని పేర్కొంది. ఈ విషయంపై పార్లమెంటు సభ్యులు, ప్రజాప్రతినిధుల నుంచి తమకు ఫిర్యాదులు అందాయని వెల్లడించింది. ఈ నేపథ్యంలో అటవీ, వన్యప్రాణుల సంరక్షణ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని, న్యాయస్థానాల ఆదేశాలకు విరుద్ధంగా ఎలాంటి ఉల్లంఘనలు జరగకుండా చూడాలని స్పష్టంచేసింది. ఈ అంశంపై వాస్తవ నివేదికతోపాటు, తీసుకున్న చర్యల వివరాలను పంపించాలని కేంద్రం ఆదేశించింది.



సీతా



# అంబరం "శ్రీరాముని కళ్యాణం" సంబరం



- ఘనంగా గ్రామ గ్రామన సీతా రాముల కళ్యాణం
- శ్రీరాముని కళ్యాణంకి ప్రజా ప్రజాప్రతినిదుల రాక

సిద్దిపేట్ టైమ్స్ , దుబ్బాక ప్రతినిధి

పలు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో దుబ్బాక పట్టణంలోని వీరాంజనేయ దేవాలయం, వైశ్య భవన్, మునూరు కాపు సంఘం,వెంకటేశ్వర స్వామి ఆదివారం ఘనంగా సీతా రాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని చేర్వపూర్ రామాలయం, చెల్లాపూర్ మూడో వార్డ్ లోని శ్రీ రాజా వేణు గోపాల స్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ రాముల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగాయి. దుబ్బాక లోని వీరాంజనేయ స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసి కల్యాణ మహోత్సవానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి సీఐ పాలేపు శ్రీనివాస్, ఎస్ఐ వడ్లకొండ గంగరాజు లతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రతి యేటా భద్రాచలంలోని రాముని పట్టాభిషేకం ఎలా నిర్వహిస్తారో అలాగే ఇక్కడ కూడ భక్తులు నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉంటుందన్నారు.స్వామి వారి ఆశీస్సులతో నియోజకవర్గం సస్య శ్యామలంగా ఉండాలని పాడి పంటలు సంవృద్ధిగా ఉండాలని ఆ భగవంతుణ్ణి ప్రార్ధించినట్లు తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమానికి భక్తులు విచ్చేసి పెద్ద ఎత్తున విజయవంతం చేసేందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా వార్డు ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ

## కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



సిద్దిపేట్ టైమ్స్ మెదక్ జిల్లా ప్రతినిధి

ఆదివారం కలెక్టర్ పాపన్నపేట మండలం రామాలయం గుడి దగ్గర ఉన్న పౌరసరఫరాల శాఖ మండల్ లెవెల్ స్టాక్ పాయింట్ (గోడౌన్) ను పరిశీలించారు. గోడౌన్ లో నిల్వ ఉన్న బియ్యం నాణ్యతలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడి సెంటర్స్, హాస్టల్స్ సరఫరా చేసే బియ్యం, రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ సంబంధిత వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు, రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కు సరిపడే బియ్యం , స్టాక్ ఉండే విధంగా సివిల్ సప్లై శాఖ ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్ రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై మండల లెవెల్ స్టాక్ పాయింట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారాములకు పల్లకిని అందజేసిన భక్తుడు

సిద్దిపేట టైమ్స్ శివ్వంపేట్



శివంపేట మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామ స్వామి దేవాలయం అందాల రాముడు, అందరి దేవుడు, సీతారాముల కళ్యాణం మహోత్సవం ఘనంగా నిర్వహించారు సీతారాముల కళ్యాణం విశిష్టతను పూజారి వామన శర్మ చక్కగా వివరిస్తూ కల్యాణన్ని జరిపించారు ఈ సందర్భంగా శివంపేటకు గ్రామానికి చెందిన శేరిపల్లి.రాములు, పల్లకి సేవను రామాలయా గుడికి అందజేశారు



# ప్రజారోగ్య పరిరక్షణకు పటిష్ట చర్యలు : కలెక్టర్

- ప్రభుత్వ సంక్షేమ పాఠశాలల్లో నాణ్యమైన మెనూ, ఉత్తమ విద్యాబోధన
- జిల్లాలో 24 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యం
- టేక్మాల్ మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్
- ఆసుపత్రి, కేజీబీవీ, సబ్ స్టేషన్ పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేసిన కలెక్టర్
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్







సిద్దిపేట టైమ్స్ మెదక్ జిల్లా ప్రతినిధి

ప్రజారోగ్య పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటూ, సంక్షేమ పాఠశాలల్లో నాణ్యమైన మెనూ , జిల్లాలో నిరంతర విద్యుత్ అందించడం లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. దివారం మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన నిర్వహించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలు గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు సిబ్బంది హాజరు పట్టిక, ఓపి రిజిస్టర్ మందులు నిల్వ చేయు స్టోర్ రూమ్ సంబంధిత వాటిని పరిశీలించి ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రోగులకు మెరుగైన వైద్య అందించాలని వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టుకోవాలని, సమయపాలనతో విధులు సక్రమంగా నిర్వహించి ప్రభుత్వ ఆదేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు విద్యార్థులకు అందిస్తున్న మెనూ పరిశీలిస్తూ విద్యార్థులను ప్రశ్నలతో , జవాబులతో సామర్థ్యాలను పరీక్షించారు. సానుకూల సమాధానం విద్యార్థుల నుండి రాబట్టి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన మెనూ అందించి క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అందిస్తున్నట్లు చెప్పారు. స్టోర్ రూమ్ను పరిశీలిస్తూ కూరగాయలు పప్పు దినుసులు నాణ్యతతో కూడినవి ఉండాలని, భోజనం తయారు చేసిన వెంటనే రుచి సూచి ప్రాధాన్యతనిస్తూ తయారు చేసిన మెనూ తప్పనిసరిగా టేస్ట్ చూడాలని తదుపరి విద్యార్థులకు భోజనాన్ని వడ్డించాలని చెప్పారు జిల్లాలో ఉన్న అన్ని సంక్షేమ పాఠశాలలు వసతి గృహాలు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఉంటున్నాయని కలెక్టర్ వివరించారు. తదుపరి మండల కేంద్రంలో 33/11 %ఖఎ% విద్యుత్ సబ్టేషన్ పరిశీలించి సబ్ స్టేషన్ ద్వారా మండల కేంద్రంలో ఎన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుంది 24 గంటలు విద్యుత్ అందించడానికి మీ శాఖ ద్వారా తీసుకున్న చర్యలు, ఓవర్ లోడింగ్ ,సంబంధించిన విషయాలను విద్యుత్ శాఖ అధికారులు అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కోతలు లేని విద్యుత్ అందించడం లక్ష్యంగా అధికారులను సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ అధికారులు కలెక్టర్కు వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా

# సీతారాముల కళ్యాణ మహోత్సవం







- చూసి తరించిన భక్తజనం..
- శ్రీరామనవమి సందర్భంగా మెదక్ కోదండ రామాలయాన్ని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు
- నియోజక వర్గ ప్రజలందరికి శ్రీరామ నవమి శుభాకాంక్షలు
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

సిద్దిపేట్ టైమ్స్ మెదక్ జిల్లా ప్రతినిధి

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగదానంద కారకుడు, జగదభిరాముడు, భక్తకోటి తీరొక్క పేరుతో పిలుచుకునే కోదండ రామాలయంలో రాములోరి కల్యాణ వేడుక ఆదివారం మెదక్లో లో కనుల పండువగా సాగింది. అభిజిత్ లగ్నంలో రాముడు, జగన్మాత సీతమ్మ మెడలో మాంగళ్యధారణ చేశారు. . దేవదేవుడి కల్యాణవైభోగాన్ని కనులారా వీక్షించిన భక్తజనం పులకించారని చెప్పారు.కోదండ రాముని ఆశీస్సులతో జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆ కోదండ రాముని కోరుకున్నట్లు కలెక్టర్ వివరించారు.

## పంచతంత్ర పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :




పట్టణ కేంద్రంలోని పంచతంత్ర పాఠశాలలో గ్రాడ్యు యేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ కోర్సు పూర్తిచేసిన యూకేజీ విద్యార్థులకు, ప్రైమరీ కోర్సు పూర్తి చేసిన 5వ తరగతి విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రధానం జరిగింది. అనంతరం ది మాస్టర్ మైండ్ అకాడమిక్ మేనేజర్ డాక్టర్ మురళీధర్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదవాలని అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రీజనల్ మేనేజర్ రత్నకుమారి రుద్ర మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్యామల మాట్లాడుతూ పాఠశాలలో జరిగే ప్రతి కార్యక్రమాన్ని తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బాలకిషన్, శ్రీనివాస్, అవినాష్ లు పాల్గొనగా విద్యార్థులు చేసిన కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు

సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :





శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని జరుపుకునే సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు ఆదివారం చేర్యాల, కొమురవెల్లి మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాలలోని దేవాలయాలలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా చేర్యాల పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో విగ్రహ దాత తడక లింగమూర్తి దంపతులు, రాంప్రకాష్ దంపతులు కళ్యాణకర్తలుగా వ్యవహరించగా వైదిక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు మంగళగిరి శేషాచార్యులు, రాజు స్వామి లు నిర్వహించారు. అదేవిధంగా చేర్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద గల శ్రీ ఆది ఆంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా జరుగగా ఆలయ భూదాత గుళ్ళపల్లి తిరుమల కాంతి కృష్ణ, పెద్ది అంజయ్య గుప్తా, కల్కి రమేష్, సుధాకర్, బూరగొని శ్రీనివాస్ గౌడ్ తదితరులు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొని వచ్చి మంగళ వాయిద్యాల నడుమ ఆలయము చుట్టూ ప్రదక్షణాలను జరిపారు. అనంతరం మంత్రోచ్చారణల మధ్య శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా కార్యక్రమంలో భక్తులు ఔచర్ల యాదయ్య, గణేష్ తివారి, కల్వకోట రాజేశ్వరరావు, అంబాల శ్రీనివాస్ గౌడ్, లింగా చారి, రామ్మూర్తి తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆ ఆదిదంపతుల కృపకు పాత్రులయ్యారు.

## ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :



భారతీయ జనతా పార్టీ 45వ వార్షిక ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చేర్యాల పట్టణములో ఆదివారం పార్టీ పట్టణ అధ్యక్షుడు మన్నె సత్య వర్ధన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ జరిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ ల ఆదేశానుసారం ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృషి చేస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలను ప్రతి ఒక్కరికి తెలియపరిచేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూరుగు సురేష్ గౌడ్, అంకుగారి శశిధర్ రెడ్డి, ఇర్రి ఉమా సురేష్ రెడ్డి, వడ్లకొండ సంజీవులు, పోతుగంటి రామదాసు, నర్ర మహేందర్ రెడ్డి, బింగి శ్రీనివాస్, పుర్మా సంజీవరెడ్డి, కొట్టే చంద్రమౌళి, వెలుగల వినయ్, కుర్రం బాల నరసయ్య, ఔచర్ల నరసింహులు, కర్క తిరుపతిరెడ్డి, కల్వకుంట్ల మనీష్, పాము వెంకటేశం, అంజయ్య, సత్యనారాయణ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## చాకరిమెట్ల దేవాలయంలో ఘనంగా సీతారాముల పెళ్లి వేడుక

సిద్దిపేట టైమ్స్ శివంపేట్







శివ్వంపేట్ మండల పరిధిలోని ఆలయాలలో శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగ జరుగుతున్నాయి. అలాగే జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన సహకార ఆంజనేయస్వామి చాకరిమెట్ల ఆవరణలో నిర్మించిన రామాలయంలో జరుగుతున్న కళ్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో కళ్యాణనీ తిలకించి అనంతరం భోజనాలు చేయాలని ఆలయ నిర్మాణ దాత దశరథ రెడ్డి ఆయన సొంత డబ్బుతో ఈరోజు కార్యక్రమాలు జరిపించారు.

# కన్నుల పండుగగా శ్రీరామ కళ్యాణం







**సిద్దిపేట టైమ్స్, నంగునూరు:**
సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని వివిధ గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో సీతారాముల కళ్యాణం నిర్వహించారు. సిద్దన్నపేటలోని పాటిమీది భక్తాంజనేయ దేవాలయం వద్ద సీతారాముల కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది. నంగునూరు లోని తోకలకొండపై వెలసిన సీతారామ ఆలయంలో శ్రీరామ కళ్యాణం వేడుకగా నిర్వహించారు. బద్దిపడగలోని శ్రీ రాజరాజేశ్వరి దేవాలయ ప్రాంగణంలోని శ్రీ సీతారామాలయంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. మగ్దూంపూర్ లోని హనుమాన్ దేవాలయంలో శ్రీరామ కళ్యాణం నిర్వహించారు. ఖాతాలోని మహాదేవి స్వామి గుట్టపై కళ్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది. నర్మెట,పాలమాకుల, కోనాయిపల్లి, వెంకటాపూర్, రాజగోపాలపేట, ముండ్రాయి, రాంపూర్, అక్కెనపల్లి, గణపురం, కొండం రాజు పల్లి, గట్ల మల్యాల, దర్గపల్లి, మైసంపల్లి, నాగరాజు పల్లి, ఖానాపూర్, అంక్షాపూర్ గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో లలో అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో సందడి నెలకొంది.











## బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**సిద్దిపేట టైమ్స్, నంగునూరు,**
బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నంగునూరు మండలం ఖానాపూర్ గ్రామంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన తేలు శ్రీశైలం కుమారుడు వంశీ తేజ పుట్టిన రోజు సందర్భంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో బాటసారులు మంచినీటి కోసం ఇబ్బందులు పడకుండా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు శ్రీశైలం తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ బాల వికాస మహిళా సంఘాల మహిళలు, గ్రామస్తులు, బాల వికాస మహిళా సమన్వయకర్తలు సుజాత, లక్ష్మి, అన్నమేరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- మూడుసార్లు అధికారంలోకి వచ్చిన ఏకైక పార్టీ బిజెపి
- రానున్న రోజుల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్

**సిద్దిపేట టైమ్స్ , దుబ్బాక ప్రతినిధి**



రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ అన్నారు. ఆదివారం బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా దుబ్బాక పట్టణ కేంద్రంలోని మున్సిపాలిటీ అధ్యక్షులు దొరగోల్లా శ్రీకాంత్ యాదవ్ బీజేపీ జెండా ఎగర వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ....బడుగు బలహీన వర్గాల కోసం ఏర్పాటు చేసిన భారతీయ జన సంఘ్ రాజకీయం ద్వారా ప్రజలకు మరింత సేవలు చేయాలని దృక్పథంతో భారతీయ జనతా పార్టీ గా ఆవిర్భవించిందన్నారు. శ్యాం ప్రకాష్ ముఖర్జీ, దీన్ దాయల్ ఉపాధ్యాయ అ తర్వాత అటల్ బీహార్ వాజ్పేయి, లాల్ కృష్ణ అద్వానీ ఆధ్వర్యంలో బీజేపీ గా మారి నేడు నేడు ప్రపంచంలో అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందన్నారు. 16 కోట్ల సభ్యత్వాలు కలిగి దేశంలో మూడుసార్లు అధికారంలోకి వచ్చిన పార్టీగా దేశ సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రానుందన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు, నాయకులకు బిజెపి ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మున్సిపల్ అధ్యక్షులు శ్రీకాంత్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ 45 ఏళు ్ళగా దేశ ప్రజల కోసం, సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్ చింత సంతోష్, జిల్లా నాయకులు కిష్టమ్మ గారి సుభాష్ రెడ్డి, కిష్టమ్మగారి రమేష్ రెడ్డి, సుంకోజు ప్రవీణ్ కుమార్, మల్లు గారి రమణారెడ్డి,కొట్టె వంశీ, పల్లె నేషల్ గౌడ్, పల్లె మనోజ్, గొల్ల , గొల్ల నరేష్,గవ్వల రమేష్, బోయ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా సీతారాముల కళ్యాణ ఉత్సవాలు

### ఉత్సవాలలో పాల్గొన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట అర్బన్**
శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కళ్యాణ ఉత్సవాలను సిద్దిపేట అర్బన్ మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట అర్బన్ మండలం బక్రి చెప్యాల గ్రామంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ ఉత్సవానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ హాజరై కళ్యాణ ఉత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీరామనవమి పురస్కరించుకొని అర్బన్ మండలంలోని ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.









## అంగరంగ వైభవంగా సీతారాముల పద్మావతివెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట ప్రతినిధి**
నిజాంపేట మండలంలో చల్మెడ గ్రామంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో శ్రీ శ్రీ శ్రీ శ్రీ సీతా రాముల కళ్యాణ మహోత్సవం, శ్రీ వెంకటేశ్వర స్వామి పద్మావతి అలివేలి మంగ దేవిల కళ్యాణం మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు పనింద్ర చార్యులు, వెంకట్ రామ్మోహన శర్మ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా వేద పండితులు పనింద్ర చార్యులు మాట్లాడుతూ శ్రీరామనవమి పురస్కరించుకొని అరుదుగా వచ్చే పునర్వసు నక్షత్రం రోజున శ్రీ సీతారాముల కళ్యాణం శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం రెండూ ఒకే రోజు చల్మెడ గ్రామంలోని వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తుల సన్నిధిలో నిర్వహించుకోవడం మహాద్భుత అవకాశమని ఆయన అన్నారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆయన స్వామివారిని కోరుకున్నారు. అలాగే ఆలయ ఫౌండర్ చైర్మన్ రాచకొండ ఎస్ఓటి అడిషనల్ ఎస్పీ నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ స్వామి వారి కళ్యాణం ప్రతిఏటా శ్రీరామ నవమి నాడు నిర్వహించుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామని గ్రామస్తుల సహకారంతో ముమ్ముందు ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. స్వామివారి కళ్యాణాన్ని జరిపించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. స్వామి వారి కళ్యాణా అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం





చేశారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో ఆలయ కమిటీ చైర్మన్ రాచకొండ అడిషనల్ ఎస్పీ నంద్యాల నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ అక్క పల్లి రాంరెడ్డి, అక్కపల్లి మహేందర్ రెడ్డి, నంద్యాల ముత్యం రెడ్డి, బాజా రామచంద్రం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చప్పటం ముత్యం రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ చప్పట నరసింహారెడ్డి, తాజా మాజీ ఉపసర్పంచ్ తుమ్మల రమేష్, అక్కపల్లి అబ్బా రెడ్డి, అక్కపల్లి మోహన్ రెడ్డి, దొంతర బోయిన మధు, ఆకుల రాజు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## రామాయంపేట మున్సిపాలిటీ మండలంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

### అక్కన్నపేటలో సగర యువకుల బైక్ ర్యాలీ

**సిద్దిపేట టైమ్స్ రామయంపేట ప్రతినిధి**
రామాయంపేట మున్సిపాలిటీలోని పాండు చెరువు కట్ట రామయంపేట శ్రీ శ్రీ కళ్యాణ రామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీ సీతారామస్వామి కళ్యాణ వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.మండలంలో అన్ని గ్రామాల్లో శ్రీరామ నవమిని ఆదివారం భక్తులు ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలను ఊరేగింపుగా నిర్వహించి రామాలయం, హనుమాన్ దేవాలయాలు వద్దకు చేరుకొని శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. రామాయంపేట మండలం దామరచెరువు హనుమాన్ దేవాలయం వద్ద శ్రీ సీతారాముల కళ్యాణాన్ని పాకాల కవితబిఅమరేంద్రరావు దంపతులు నిర్వహించారు. అనంతరం గ్రామంలో అన్నదానం కార్యక్రమం చేపట్టి భక్తిశ్రద్ధలతో సీతారాములు విగ్రహాల ఊరేగింపు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాకాల రమాదేవిబిశ్రీధర్ రావు, పాకాల శ్రీలతబి చంద్రశేఖర రావు దంపతులు పాల్గొన్నారు. అక్కన్నపేట గ్రామంలో సగర సంగం యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే ప్రగతి ధర్మారం గ్రామంలోని రామాలయం లో జరుగుతున్న శ్రీరామనవమి వేడుకల్లో మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ కంటారెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బీజేపీ జెండా ఆవిష్కరణ

**సిద్దిపేట టైమ్స్, నంగునూరు,**
నంగునూరు మండలంలోని సిద్ధన్నపేట, మగ్ధుంపూర్ గ్రామాలలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ,అమిత్ షాల నేతృత్వంలో వచ్చే ఎన్నికలలో తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామని బీ జే పీ జిల్లా సీనియర్ నాయకులు వాసర యాదమల్లు, పరకాల తిరుపతిరెడ్డి, గంధం పరమేశ్వర్ రెడ్డి, పంగ నరసింహారెడ్డి, మంత్రి కొమురయ్య, అన్న రాజయ్య లు తెలిపారు. పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం నినాదాలతో హోరెత్తించారు. చిన్నారులు,వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లు తిరుపతి, కత్తుల పరమేశ్వర్ రెడ్డి, చిలుకల తిరుపతిరెడ్డి, అచ్చిన రవి, కొలుపుల ఆశోక్ నాయకులు బెండల రాజ లింగం,జాప అంజయ్య, మయోజు రాజయ్య, బండారు భూపతి తదితరులు పాల్గొన్నారు.



# రామ నామ స్మరణ...!!






- అంతా రామమయం.. ప్రజల మధ్య అధ్యాత్మిక.. ఆత్మీయ పలకరింపు..!!
- శ్రీరామ నవమి వేడుకల్లో హరీష్ రావు.
- సిద్దిపేట లో 30 దేవాలయాల్లో శ్రీ రాముని కళ్యానోత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు..




సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట ప్రతినిధి,
రామ నామం.. రామ నామ స్మరణ తో.. ఆధ్యాత్మిక ఆత్మీయ పలకరింపు తో ఆదివారం సిద్దిపేట లో శ్రీరామ నవమి వేడుకల్లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు.. ఒక వైపు కల్యాణ కార్యక్రమం.. మరో వైపు ప్రజల తో మమేకం అవుతు.. ఆత్మీయ పలకరంపు.. ఆధ్యాత్మిక పరవశం తో శ్రీ రామున్ని దర్శించుకున్నారు. సిద్దిపేట పట్టణం లో శ్రీరామ నవమి వేడుకల్లో స్వామి ని దర్శించుకున్న హరీష్ రావు.- 8 గంటలు.. 30 దేవాలయాలు..!! శ్రీరామ నవమి సందర్భంగా సిద్దిపేట పట్టణం లో హరీష్ రావు కళ్యాణో త్సవాల్లో పాల్గొన్నారు.. శ్రీ రామాలయం - పారుపల్లి విధి, శ్రీ రామ రాజు రావి చెట్టు హనుమాన్ దేవాలయం పారుపల్లి విధి, శ్రీ దాసంజ నేయ స్వామి దేవాలయం - పాత గంజి, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం- రేణుక నగర్, అభయ ఆంజనేయ స్వామి దేవాలయం - లింగారెడ్డి పల్లి, హనుమాన్ దేవాలయం నాసర్ పురా, శ్రీ గురు దత్త హెల్పింగ్ సోసైటీ ఖాదర్ పూర 29 వ వార్డ్, హనుమాన్ దేవాలయం గాంధీ నగర్., హనుమాన్ దేవాలయం - సంతోష్ నగర్ కాలనీ, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం సుభాష్ నగర్ 10వ వార్డ్., హనుమాన్ దేవాలయం రూరల్ పోలీస్ స్టేషన్., శ్రీ బాలంజనేయ స్వామి దేవస్థానం ప్రశాంత్ నగర్ 13వ వార్డ్, శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం లెక్చరర్ కాలనీ 14వ వార్డ్, శ్రీ షిరిడి సాయి బాబా దేవాలయం, శ్రీ ప్రసన్నంజనేయ స్వామి దేవాలయం హనుమాన్ నగర్ 6వ వార్డ్, శ్రీ ప్రసన్నంజనేయ స్వామి దేవాలయం గణేష్ నగర్..,దక్షణ ముఖి ఆంజనేయ స్వామి దేవాలయం - శ్రీ నగర్ కాలనీ 5 వ వార్డ్, శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం - హరిప్రియ నగర్, శ్రీ పంచముఖ హనుమాన్ దేవాలయం - శివాజి నగర్, శ్రీ మహా



అంజనేయ స్వామి దేవస్థానం - రాజేంద్రనగర్ 3 వ వార్డ్, హనుమాన్ దేవలయ%శీ% హౌసింగ్ బోర్డ్ కాలనీ, మహా శక్తి నగర్ ఇలా దేవాలయాల్లో స్వామి ని దర్శించుకున్నారు.



## నార్సింగ్ మండల వ్యాప్తంగా ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

సిద్దిపేట టైమ్స్ రామాయంపేట ప్రతినిధి
ఆదివారం నాడు నార్సింగి మండల వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ 45వ వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అన్ని బూతులలో ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది అంత్యోదయ సిద్ధాంతంతో వరుసలో చివరగా నిలబడిన వ్యక్తి కూడా ప్రభుత్వ ఫలాలు అందాలనే ఉద్దేశంతో స్థాపించబడిన పార్టీ భారతీయ జనతా పార్టీ దేశం యొక్క సమూల అభివృద్ధి కొరకు పాటుపడే విధంగా ప్రభుత్వ విధానాలను తయారు చేస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో బిజెపి మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు సత్య పాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, సీనియర్ నాయకులు బాల్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మైలారం లక్ష్మణ్,, సీనియర్ నాయకులు జనం లింగారెడ్డి, గురుపాదం, నారా గౌడ్, యాదగిరి, నరేష్,స్వామి, రెడ్డి హరిబాబు, నరేష్, నితిన్, స్వామి, సత్యం, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొనడం జరిగింది

## వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

### జక్కన్నపేట లో హాజరైన మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి



సిద్దిపేట్ టైమ్స్ మెదక్ జిల్లా ప్రతినిధి
హవేలి ఘనపూర్ మండలం జక్కన్నపేట గ్రామంలో హనుమాన్ దేవాలయం వద్ద శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఇక్కడ మొదటి సారిగా సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే యం. పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొని శ్రీరామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఒడి బియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ... సీతారాముల విశిష్టతను కొనియాడారు. సీతారాముల పవిత్రబంధం భావితరాలకు ఆదర్శమని, శ్రీ రామచంద్రుడి పాలన ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సీతారాముల ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఆలాగే హవెళి ఘనపూర్ మండలం కొచ్చేరువు తండా,గాజులవాయి తండాలో శ్రీ పబ్బత్ హనుమాన్ దేవాలయం ప్రారంభోత్సవంలో పాల్గొని ఆంజనేయ స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరి వెంట మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ అరెళ్ల. మల్లికార్జున్ గౌడ్, ఏఎంసి మాజీ చైర్మన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఆంజనేయులు, కిషోర్, శ్రీనివాస్,మాజీ ఎంపిపి ఆంజనేయులు, జక్కన్నపేట మాజీ సర్పంచ్ చామంతుల సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు మెడిశెట్టి శంకర్, శ్రీనివాస్ గౌడ్, శ్రీను నాయక్,రంజిత్ నాయక్, లడ్డు నాయక్, గ్రామస్తులు తదితరులున్నారు.






## చల్మెడ గ్రామంలో ఘనంగా శ్రీ సీతారాముల శోభాయాత్ర



సిద్దిపేట్ టైమ్స్ రామయంపేట ప్రతినిధి
నిజాంపేట మండలం చల్మెడ గ్రామంలో శ్రీ రామ నవమి సందర్భంగా శ్రీ సీతారాముల శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. స్వామి వార్ల కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించు కొని ఆదివారంనాడు సాయంత్రం స్వామివారి ఉత్సవవిగ్రహాలకు వెంకటేశ్వర స్వామి సన్నిధి నుండి గ్రామ పురవీధుల గుండా వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శోభా యాత్రను ఘనంగా నిర్వహించారు. శోభా యాత్ర సందర్భంగా చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శ నలు, కోలాటం గ్రామస్తులను భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రతి సంవత్సరం సీతారాముల కళ్యాణ అనంతరం గ్రామంలో శోభాయాత్ర ను ఘనంగా నిర్వహిస్తున్నారు. శోభాయాత్ర సందర్భంగా సీతారామచంద్రస్వామి వెంకటేశ్వర స్వామి వార్లకు గ్రామ ఆడపడుచులు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. వారికి నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ శోభాయాత్రలో ఆలయ ఫౌండర్ వైస్ చైర్మన్ అక్క పల్లి రామిరెడ్డి, డైరెక్టర్లు నంద్యాలముత్యం రెడ్డి, బాజ రమేష్, అక్కపల్లి మహేందర్ రెడ్డి, గ్రామస్తులు చిన్నారులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## అంగరంగ వైభవంగా రాములోరి కల్యాణం




- దౌల్తాబాద్ మండలంలో సీతారాముల కళ్యాణం
- సీతారాముల కళ్యాణం లో పాల్గొన్న ఎస్ఐలు




సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్ :
దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో గురువారం శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణలు, బాజా బజంత్రీలతో రామచంద్రస్వామి కళ్యాణం జరిగింది. అంతకు ముందు ఆలయ ధర్మకర్త అన్నారెడ్డి సుబాష్‌రెడ్డి దంపతులు స్వామివారి తలంబ్రాలను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు. కళ్యాణోత్సవంలో భాగంగా ఉదయం స్వామి వారికి అభిషేకం, ఎదుర్కోళ్ళు నిర్వహించారు. సీతారామ చంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో బాగంగా సోమవారం పొన్నంగి సేవ, మంగళవారం హనుమత్‌సేవ, బుధవారం గరుడ సేవ జరుగుతుంది. గురువారం తెల్లవారు జామున స్వామివారి రథోత్సవం జరుగుతుంది. శుక్రవారం శేషహోమం, పూర్ణాహుతి, శ్రీ పుష్పయాగం, ఉద్వాసనబలులు, సప్తవర్ణ ఏకాంత సేవ, తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తా యని నిర్వాహకులు తెలిపారు. అలాగే రాయపోల్, దౌల్తాబాద్, అనాజీపూర్, వడ్డేపల్లి, ఎల్కల్, బేగంపేట మహ్మద్‌షాపూర్ ఉప్పరపల్లి తదితర గ్రామాలలో శ్రీరామచంద్రస్వామి కళ్యాణం నిర్వహించారు.




## అలయన్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు..

సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట
అలయన్స్ సిద్దిపేట జిల్లా నూతన గవర్నర్ గందె ఈశ్వర్ చరణ్ నిర్వహణలో స్థానిక శ్రీ సీతారామ కళ్యాణోఉత్సవ సందర్భంగా పలు కార్యక్రమం నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలో అతి పురాతనమైన శ్రీ రామాలయం వద్ద శ్రీ సీతారామ కళ్యాణోత్సవానికి వచ్చే భక్తుల దహార్తి తీర్చడానికి మాతృశ్రీ క్లబ్ అధ్యక్షులు ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో చలిదేవేంద్రం ఏర్పాటు చేసి భక్తులకు చల్లటి పానీయములు అందజేశారు.స్థానిక శంకర్ నగర్ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో భగీరథి క్లబ్, రాణి రుద్రమ క్లబ్ అధ్యక్షుల ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కళ్యాణోత్సవం లో ముత్యాల తలంబ్రాలు పెళ్లి వస్త్రములు అందజేశారు. శివాజీ నగర్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ సీతారామ కళ్యాణోత్సవానికి స్వరాజ్యం క్లబ్ అధ్యక్షుల ఆధ్వర్యంలో ముత్యాల తలంబ్రాలు పెళ్లి వస్త్రములు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ గంద ఈశ్వర్ చరణ్, ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్స్ ఆత్మ రాములు, సోమ వనజ, సౌత్ మల్టిపుల్ పి ఆర్ ఓ బాల చంద్రం, జిల్లా రేణుక %ూ=ా%, నాగరాణి %=జ%, మంజుల %్గజ%, క్లబ్బుల అధ్యక్షులు, సెక్రటరీలు, కోశాధికారులు మరియు సభ్యులు పాల్గొన్నారు.

## దేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన ప్రధాని మోడీ..

### ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి.. సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్..




సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట
జాతీయవాద భావంతో, సైద్ధాంతిక నిబద్ధతతో ప్రజల మన్ననలు అందుకుంటూ, అప్రతిహత విజయాలు సాధిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా భారతీయ జనతాపార్టీ అవతరించిందని బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ అన్నారు. పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని సిద్ధిపేట జిల్లా కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి వేడుకలు జరిపారు. జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బైరి శంకర్ మాట్లాడుతూ.. పార్టీని ముందుకు నడిపించడమే కాకుండా దేశాన్ని కూడా అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకెళుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేశారని కొనియాడారు. జన సంగ్ నుంచి 1980, ఏప్రిల్ 6న శ్యాంప్రసాద్ ముఖర్జీ, దిందయాల్ ఉపాధ్యాయ, అటల్ బిహారి వాజ్‌పేయి, అద్వాని ఆధ్వర్యంలో బీజేపీగా అవతరించిందన్నారు. అప్పుడు ఇద్దరు ఎంపీలతో మొదలైన బీజేపీ వరుసగా మూడవసారి అధికారంలోకి వచ్చి చరిత సృష్టించిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం బిజెపి లోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వంగ రాంచంద్ర రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూది శ్రీకాంత్ రెడ్డి, కొత్తపల్లి వేణు గోపాల్, గుండ్ల జనార్ధన్, గోనె మార్కండేయులు, బందారం కనకరాజు, తొడుపునూరి వెంకటేశం, కెమ్మసారం సంతోష్, బొడ్డు సునీల్, పద్మ, తమ్మిశెట్టి వీరేశం, శివ కుమార్, వరప్రసాద్, కాసన గట్టు సంతోష్, సుతారి కార్తీక్, కనకరాజు, శ్రీనివాస్, ఎయిర్టెల్ వెంకట్, భోగి శ్రీనివాస్, కొండూరి మహేష్, అభి, సత్యనారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

## మల్లన్నను దర్శించుకున్న అడిషనల్ కమీషనర్ జ్యోతి



సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :
కొమురవెల్లి మల్లికార్జున స్వామిని తెలంగాణ దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ జ్యోతి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ప్రసాదాన్ని, శేష వస్త్రములను, స్వామి వారి ప్రతిమను అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో రామాంజనేయులు, ఏఈఓ బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్లు శ్రీరాములు, సురేందర్ రెడ్డి ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీరాముని ఆశీస్సులతో... ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి







- ఘనంగా కోదండ రామాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ దంపతులు
- నియోజక వర్గ ప్రజలందరికి శ్రీరామ నవమి శుభాకాంక్షలు
- ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్

సిద్దిపేట టైమ్స్ మెదక్ జిల్లా ప్రతినిధి

శ్రీరాముని ఆశీస్సులతో... మెదక్ నియోజక వర్గ ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. ఆదివారం శ్రీరామనవమిని పురస్కరించుకోని మెదక్ పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే రోహిత్ సతీమణి శివాణి లు హాజరై పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూల మాల వేసి, శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మానికి, నీతికి, విలువలకు, సుపరిపాలనకు నిలువుటద్దం శ్రీరాముడని ఆయన కొనియాడారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీ రాముడి లాగా సుపరిపాలన అందిస్తూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం దేశం అబ్బురపడేలా పాలన కొనసాగిస్తూ దశాబ్దాల సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఇందుకు బీసీ కులగణన చేపట్టడంతో పాటు బీసీ రిజర్వేషన్లు ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేయడమే నిదర్శనమన్నారు. ఆ జగదాబి రాముడి అనుగ్రహంతో ప్రజలంతా కష్టాలు తొలిగి, ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొజ్జ పవన్, తాజా మాజీ మున్సిపల్ చైర్మెన్ తొడుపునూరి చంద్రపాల్, తాజా మాజీ కౌన్సిలర్ లు దుర్గప్రసాద్, సమి, రాగి అశోక్, దొంతి లక్ష్మి ముత్యం గౌడ్, పట్టణ అధ్యక్షులు గూడూరి ఆంజనేయులు గౌడ్, హరిత, రమేశ్, స్వరూప, చంద్రబోస్, శివరామక్రిష్ణ, దేవుల, అరుణ లతో పాటు తదితరులు పాల్గోన్నారు.




## వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

సిద్దిపేట టైమ్స్,తూప్రాన్/మనోహరాబాద్ :-

శ్రీరామ నవమి పురస్కరించుకొని అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య అత్యంత వైభవంగా జరిగింది. భక్తజనం సీతారాముల.కళ్యాణాన్ని చూసితరించారు. శ్రీరామనవమి సందర్భంగా రామాలయాన్ని ప్రజా ప్రతినిధులు, ప్రజలు, భక్తులు శ్రీశ్రీశ్రీ కోదండ రామస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.తూప్రాన్,మనోహరాబాద్ మండలం లోని ఆయా గ్రామాలలో వేడుకలు ఘనంగా జరిగాయి.మనోహరాబాద్ మండలం కుచారం,మనోహరాబాద్,పర్కిబండ తదితర గ్రామాలలో వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకలలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి,మాజీ ఎఫ్డిసి చైర్మన్ ప్రతాప్ రెడ్డి,సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.వేడుకలకు వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.ఈ వేడుకలలో ప్రజాప్రతినిధులు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అప్పాయిపల్లిలో బిజెపి ఆవిర్భావ దినోత్సవం





సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్

భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దౌల్తాబాద్ మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరించడం జరిగింది . బీజేపీ గ్రామ అధ్యక్షుడు కేశబోయిన ఆంజనేయులు బీజేపీ నాయకులు ఓ బి సి మోర్చా అప్పాయిపల్లి తాజా మాజీ ఉప సర్పంచ్ కేశబోయిన ప్రభాకర్,గణేష్ పరమేశ్వర్, ప్రశాంత్, నర్సింలు,తదితరులు పాల్గొన్నారు.

## రుక్మాభట్ల సిద్దిపేటకు గర్వ కారణం



- మాజీ మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట టైమ్స్, సిద్ధిపేట ఏప్రిల్ 06:

గేయ రామాయణ కర్త, జీవిత పర్యంతం రామకథను గానం చేస్తున్న గేయ వాల్మీకి రుక్మాభట్ల నరసింహస్వామి సిద్దిపేట మట్టిబిడ్డ కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గేయ రామాయణాన్ని రచించి రామ కథా గానంతో రామాయణ విలువలను ప్రచారం చేస్తున్న గేయ వాల్మీకి రుక్మాభట్ల నరసింహ స్వామిని ఆదివారం సాయంత్రం సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి తన్నీరు హరీశ్ రావు, శాసనమండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్, ప్రముఖ కవి ఇరివెంటి వెంకటరమణ, మాజీ శాసన మండలి సభ్యుడు ఫారూఖ్ హుస్సేన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ వాగ్గేయకారుల అనగానే అన్నమయ్య, త్యాగయ్య తదితరులను గుర్తుకొస్తారని చెప్పారు. గేయ రామాయణాన్ని రచించి గేయ వాల్మీకిగా ప్రసిద్ధి చెందిన రుక్మాభట్ల నరసింహ స్వామి తాను రచించిన రామ కథను గానం చెయడం ద్వారా వాగ్గేయకారుడిగా ప్రసిద్ధి చెందారని తెలిపారు. గేయ రామాయణాన్ని 60 సంవత్సరాలుగా గానం చేస్తూ హిందూ ధర్మాన్ని, రామ తత్వాన్ని ప్రచారం చేస్తూ తన జీవితాన్ని రామునికి అంకితం చేసిన గొప్ప మహనీయుడని చెప్పారు. సిద్దిపేట మట్టి బిడ్డ అయిన రుక్మాభట్ల నరసింహ స్వామిని శ్రీరామనవమి సందర్భంగా సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రుక్మాభట్ల నరసింహ స్వామిని రూ.50వేల నగదు పురస్కారంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విఠాల శ్రీకాంత్ శర్మ, చెప్పెల హరినాథ్ శర్మ, వేలేటి రాధాకృష్ణ శర్మ, జన మంచి సీతారామ శర్మ, కలకుంట్ల రంగాచార్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

## పక్షవాతంతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య



సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్

గత ఆరు నెలలుగా పక్షవాతంతో బాధపడుతూ ఎన్నో ఆసుపత్రులలో చికిత్స తీసుకున్నప్పటికీ పక్షవాతం పూర్తిగా తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రాయపోల్ మండలం రామారం గ్రామంలో చోటు చేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామారం గ్రామానికి చెందిన కొమ్మాయిపల్లి రామస్వామి (40) గత ఆరు నెలల క్రితం పక్షవాతానికి గురికాగా, అతని కుడి చెయ్యి కుడికాలు పనిచేయకుండా పడిపోయినయి. గజ్వేల్, సిద్దిపేట పట్టణాలలో ఆసుపత్రులలో వైద్యం చేయించుకున్నప్పటికీ పక్షవాతం పూర్తిగా తగ్గలేదు. దానితో ఎన్ని ఆసుపత్రులలో వైద్యం చేయించినప్పటికీ పక్షవాతం తగ్గడంలేదని రెండు మూడు రోజుల నుంచి మదనపడుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులందరూ భోజనం చేసిన తర్వాత వ్యవసాయ పొలం వద్దకు వెళ్లివస్తానని కుటుంబ సభ్యులకి చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. వారి వ్యవసాయ పొలం వద్ద మామిడి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు వెళ్లి చూసేసరికి రామస్వామి మృతి చెందాడు. ఇట్టి విషయం పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య కుమ్మాయిపల్లి స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్సై రఘుపతి తెలిపారు.

## 108 వాహనం ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి





సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్

ఎదురెదురుగా వస్తున్న అంబులెన్స్ 108 వాహనం ద్విచక్ర వాహనం ఢీకొన్న దుర్ఘటనలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాయపోల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామానికి చెందిన శంభు రమేష్ (38). ఎపి 29 ఎపి 3917 గల ద్విచక్ర వాహనం పై రాంసాగర్ నుంచి రాయపోల్ వైపుకు వస్తున్నారు. అదే క్రమంలో దౌల్తాబాద్ నుంచి గజ్వేల్ వైపుకు వెళుతున్న 108 వాహనం రాయపోల్ మండల కేంద్రంలో నాగులమ్మ గుడి వద్ద ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు శంభు రమేష్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా అతడిని చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స పొందిన అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రి హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రమేష్ మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.

## ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



సిద్దిపేట టైమ్స్,తూప్రాన్/మనోహరాబాద్ :-

భారతీయ జనతా పార్టీ 45 వ ఆవిర్భావ దినోత్సవం ను పురస్కరించుకొని తూప్రాన్, మనోహరాబాద్ మండలాల లో బీజేపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు.తూప్రాన్ పట్టణం లో బీజేపీ అధ్యక్షులు జానకిరామ్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ జెండా ఆవిష్కరణ చేశారు. మనోహరాబాద్ మండలం లోని కాళ్లకల్,దండుపల్లి,పర్కిబండ తదితర గ్రామాలలో బీజేపీ నాయకులు నత్తి మల్లేష్,పురం మహేష్ లు పార్టీ నాయకులతో కలిసి పాల్గొని పార్టీ ఆవిర్బవ వేడుకలు జరుపుకున్నారు. ఈ ఆవిర్భావ వేడుకలలో బీజేపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు రాజు,రమేష్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## దంపతులను హత్య చేసిన ముగ్గురు నిందితుల అరెస్టు

సిద్దిపేట టైమ్స్, నంగునూరు, ఏప్రిల్ 06:



నంగునూరులో మూడు రోజుల కిందట వృద్ధ దంపతులను చంపిన కేసులో ముగ్గురి నిందితులను అరెస్టు చేసిన ట్లు సిద్దిపేట అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) మధు తెలిపారు. పరిశోధనలో భాగంగా నంగునూరు మండలం బద్దిపడగ గ్రామానికి చెందిన పసుపుల సంపత్(32), మాలోతు రాజు(30), మాలోతు శ్రీకాంత్ (26) లను నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు. నిందితుల ముగ్గురూ కొద్ది రోజులుగా మద్యం సేవించడంతో పాటు చెడు అలవాట్లకు బానిసలయ్యారు. వీరిపై గతములో పలు దొంగతనం కేసులు నమో దయ్యాయి. వారి జల్సాలకు, తాగుడుకు డబ్బులు సరిపోవడం లేదని దా దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. దీనిలో భాగంగా నంగునూరు గ్రామ శివారులో వారు కూలీ పనికి వెళ్ళినపుడు ముసలి వాళ్లు అయిన ఆవుల పర్శరాములు తల్లిదండ్రులు ఇద్దరే వ్యవసాయ క్షేత్రంలో నివాసం ఉంటున్నట్టు గుర్తించారు. వారి శరీరం మీద బంగారు వెండి ఆభరణాలు కూడా ఉన్నాయని గమనించారు. ఎలాగైనా ఈ దంపతుల ఒంటిపై ఉన్న బంగారాన్ని, వారి దగ్గర వున్న డబ్బులను దొంగతనం చేయాలని ప్రణాళిక వేసుకున్నారు. దంపతులు అడ్డు వస్తే వారిని చంపివేసి దోచుకోవాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం ఈనెల రెండవ తేదీన రాత్రి ముగ్గురు నిందితులు కలిసి రెండు పల్సర్ బైక్ ల మీద నంగునూరు గ్రామానికి వెళ్లి ఆవుల పరశురాములు బావి వద్ద వెళ్లారు., మలోతు శ్రీకాంత్ ను రోడ్ పై కాపలా పెట్టి, పసుపుల సంపత్, మలోత్ రాజు ఇద్దరు కలిసి వ్యవసాయ క్షేత్రం లోపలికి వెళ్లారు. కంప్రెసర్ పనికి ఉపయోగించే కట్టర్ తో వెంటిలేటర్ ఇనుప జాలిని కింది వైపుకు కత్తిరించారు. రాజు లోపలికి దిగి గది తలుపును తెరవడంతో సంపత్ లోపలికి వెళ్లాడు. ఆ ఇద్దరి చప్పుడు విని వృద్ధ దంపతులు ఆవుల కొమరయ్య, బూదవ్వ నిద్ర లేచారు. బూదవ్వ వద్ద ఉన్న చెవి కమ్మలను, చెవి మాటీలను, కొమురయ్య దగ్గర ఉన్న వెండి మొలతాడును ఇవ్వాలని బెదిరించారు. దీంతో వృద్ధ దంపతులు ప్రతిఘటించారు. నిందితులను గుర్తు పట్టారు. దీంతో పోలీసులకు, వారి కుమారునికి చెబుతారనే భయంతో సంపత్ బూదవ్వ తల పట్టుకొని మంచానికి కొట్టి, గొంతు పిసికి, అక్కడే ఉన్న సిమెంట్ ఇటుకతో చాతి మీద కొట్టడంతో ఆమె చనిపోయింది. మలోతు రాజు కొమురయ్యను రుమాలుతో మెడకు వేసి ఊపిరి ఆడకుండా చేసి చంపినాడు. అనంతరం వారి దగ్గర ఉన్న బంగారం, వెండి ఆభరణాలను తీసుకుని అక్కడి నుండి నిందితులు పారిపోయారు. దొంగిలించిన సొమ్మును అమ్మి ముగ్గురు పంచుకొన్నారు. కేసు పరిశోధనలో భాగంగా ఆదివారం సిద్దిపేట రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బందితో కలిసి బద్దిపడగ వెళ్లారు. ముగ్గురు నిందితులు బద్దిపడగ బస్టాండ్ వద్ద పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంబడించి పట్టుకొని విచారించగా వృద్ధ దంపతులను చంపి బంగారు వెండి ఆభరణాలు దొంగలించినట్లు నేరం ఒప్పుకున్నారు. నిందితుల వద్ద మూడు సెల్ ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్ళు, వెండి మొలతాడు, రూ.30,800ల నగదు స్వాధీనం నిందితులను అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్ కు పంపామని ఏసిపి మధు వివరించారు. ఈ కేసును ఛేదించిన సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, రాజగోపాలపేట ఎస్ఐ ఆసిఫ్, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ, పోలీస్ సిబ్బంది కీలకపాత్ర వహించారని తెలిపారు. గ్రామాలలో, గ్రామ శివారు ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే రక్షణగా నిలుస్తాయని తెలిపారు. సీసీ కెమెరాలు పెట్టుకోవాలని ప్రజలకు సూచించారు.